

పెండింగ్ కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం అవసరం 8లో



రేపు ఒడిశాకు అప్పన్న ప్రచార రథం 8లో

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజు లు ఆకాశం మేఘావృతమై ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనిష్ట ఉష్ణోగ్రతలు ఈనెల 1న 21.5 డిగ్రీలు, 2న 21.8, 3న 22.3, 4న 22.5, 5న 22.5 డిగ్రీలు నమోదు కావచ్చని తెలిపారు.

న్యూస్‌రీల్

ఉపమాక మాడ వీధుల్లో సీసీ రోడ్లు

- రూ.25 లక్షలలో నిర్మాణం
- హెటెరో సంస్థ ఆర్థిక సాయం
- స్వామివారి రథం తిరిగేందుకు వీలుగా ఏర్పాటు



మాడ వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం కొలతలు తీస్తున్న సిబ్బంది

నక్కపల్లి: వచ్చే మార్చి నెలలో ప్రారంభం కానున్న ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలను పురస్కరించుకుని స్వామి వారి తిరువీధి సేవల కోసం ఉపమాక మాడ వీధుల్లో కొత్తగా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రముఖ రసాయన పరిశ్రమ హెటెరో యాజమాన్యం రూ.25 లక్షలు వెచ్చించి సీసీ రోడ్లు నిర్మించేందుకు ముందుకొచ్చింది. శుక్రవారం మాడ వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి సంబంధించి దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో కంపెనీ సివిల్ విభాగం సిబ్బంది, స్థానిక నాయకులు రోడ్లు నిర్మించే ప్రాంతాలను పరిశీలించారు. కల్యాణం రోజున స్వామివారికి రథోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. వారం రోజులపాటు వివిధ వాహనాలపై తిరువీధి సేవలు జరుపుతారు. రోడ్లు పాడవడంతో రథం తిరగడానికి చాలా ఇబ్బంది పడాల్సి వస్తోంది. రథం లాగేందుకు వందలాదిమంది పోటీ పడతారు. రథోత్సవం ఇబ్బంది లేకుండా దిగ్విజయంగా పూర్తికావడం కోసం విశాలమైన రోడ్లు అవసరమని స్థానికులు హోం మంత్రి వంగలపూడి అనిత, హెటెరో కంపెనీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో సుమారు రూ.25 లక్షల వ్యయంతో 650 మీటర్ల పొడవున సీసీ రోడ్లు నిర్మించేందుకు 'హెటిరో' అంగీకరించినట్లు కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు. రోడ్ల నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

శుష్క వాగ్దానాలతో ప్రజా వంచన

- అందుకే కూటమి పాలనపై 8 నెలల్లోనే వ్యతిరేకత
- మాయమాటల సర్కారుకు బుద్ధి చెప్పాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా స్థాయి సమావేశంలో శాసన మండలి విపక్ష నేత బొత్స
- పార్టీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడిగా బాధ్యతలు చేపట్టిన కరణం ధర్మశ్రీ



వైఎస్సార్ సీపీ జిల్లా స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి విపక్ష నేత బొత్స, వేదికపై కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రులు అంబటి, ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, ఎమ్మెల్సీ కల్యాణి

కశింకోట: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అమలు కాని శుష్క వాగ్దానాలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. కశింకోటలోని సరోజిని విల్లాలో వైఎస్సార్ సీపీ జిల్లా స్థాయి పార్లమెంటరీ సమావేశాన్ని శుక్రవారం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడిగా కరణం ధర్మశ్రీ బాధ్యతలు చేపట్టారు. ఈ సభలో బొత్స మాట్లాడుతూ.. మాట తప్పిన కూటమి పాలనపై 8 నెలల్లో ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయలేదంటే అధికారంలోకి వచ్చి ఎంతో కాలం కాలేదు కదా అని కూటమి వారు అంటున్నారని.. మరి పరిశ్రమలు వచ్చాయని ఎలా చెప్పుకుంటున్నారని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో వచ్చిన పరిశ్రమలను తాము తెచ్చినవిగా కూటమి ప్రభుత్వం చెప్పుకోవడం ఆక్షేపణీయమన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు కాని వాగ్దానాలు ఇవ్వడానికి ఆసక్తి చూపలేదన్నారు. మళ్లీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను అనుసరించి పథకాలు అమలు చేయాలని భావించి ఎన్నికల ముందు హామీలు ఇవ్వలేదన్నారు. గత ఐదేళ్ల పాలనలో మడమ తిప్పకుండా ఇచ్చిన హామీలను అమలు చేశారన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, ఇతర పథకాలు అమలు చేసి చూపించారన్నారు. కూటమి నేతలు అప్పుల గురించి మాట్లాడుతున్నారని, ఆ సొమ్మును సంక్షేమ పథకాలకు ఖర్చు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అతి తక్కువ కాలంలో రూ.లక్ష కోట్లు అప్పు చేసి ఏ సంక్షేమ పథకాలకు ఇచ్చారని ప్రశ్నించారు. కేవలం పింఛన్ రూ.4 వేలకు పెంచడం, ఒక గ్యాస్ సిలెండర్ తప్ప.. మిగిలిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా గాలికి వదిలేశారన్నారు. ఇప్పుడు స్కూళ్లు, వైద్య కళాశాలలు మూలనపడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమన్నారని, ఇప్పుడు యూనిట్‌కు రూ.1.20 పెంచారని, ఇది మోసం కాదా అని బొత్స ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి రూ.1800 కోట్లు డిస్కంలకు ఇచ్చారని, పేద వారిని కాపాడే ఉద్దేశం ఉంటే కూటమి ప్రభుత్వం రాయితీగా విద్యుత్ చార్జీలను భరించవచ్చు కదా? అన్నారు. రాష్ట్రంలో అకృత్యాలు, అమాయకులపై దాడులు పెరిగిపోయి అరాచక పాలన జరుగుతుందన్నారు. ఇదే చంద్రబాబుపై వ్యతిరేకతకు కారణమైందన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, శ్రేణులు



ధర్మశ్రీని సన్మానించిన బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, బూడి ముత్యాలనాయుడు

ఫోన్‌లో మాట్లాడదానికి భయపడుతున్న డీజీపీ

తాను ప్రజా ప్రతినిధిగా పోలీసులతో 15 ఏళ్లు పని చేశానని బొత్స అన్నారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఎంపీగా చేశానన్నారు. అప్పట్లో ఫోన్ చేస్తే డీజీపీ వెంటనే స్పందించి సమస్య పరిష్కరించే వారన్నారు. ఇప్పుడు ఫోన్ చేస్తే డీజీపీ భయపడిపోతున్నారని, ఫోన్ ఎత్తడం లేదని పేర్కొన్నారు. మంచి ప్రభుత్వం రావడానికి అకృత్య పాలన, దాడులపై అంతా సమన్వయంగా పనిచేసి పోరాటాలు చేయాలన్నారు. స్థానిక నాయకులు సమన్వయంగా ఉండి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి పనిచేయాలన్నారు. **నాయకత్వం నిలబడాలంటే** కార్యకర్తలకు నాయ**కులు అందుబాటులో ఉండా**లన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాలు గెలవడమే కాకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. ఆయన హయాంలో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. అమ్మ ఒడి, రైతు భరోసా, ఇతర సంక్షేమ పథకాలు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో ఒకేసారి నాలుగు పోర్టులను నిర్మించామన్నారు. భోగాపురం వద్ద ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నిర్మాణం ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి పార్టీ మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేయాలన్నారు. కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ మోసకారి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకుడిగా బాధ్యతలు చేపట్టిన కరణం ధర్మశ్రీకి పూలమాలలు, దుశ్శాలువాలు కప్పి పార్టీ శ్రేణులు అభినందించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు.

ప్రజా వ్యతిరేకతను అనుకూలంగా మలచుకోవాలి: అంబటి

కూటమి అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందని, గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూడా సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి తీరుతారని చంద్రబాబుకు వంత పాడారన్నారు. ఇప్పుడు కిమ్మనడం లేదన్నారు.

ఎనిమిది నెలల కూటమి పాలన కుళ్లిపోయిందని, దీన్ని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. కూటమిలో గుసగుసలు అప్పుడే బయలుదేరాయన్నారు. అమర్‌నాథ్ అంచెలంచెలుగా ఎదిగారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా మంత్రి పదవి ఇచ్చి గౌరవించారన్నారు. అటువంటి అమర్‌నాథ్‌ను కోడిగుడ్డుగా మంత్రి నారా లోకేష్ సంబోధిస్తున్నారని, లోకేష్ వట్టి పప్పు శుద్ధ అని ఎద్దేవా చేశారు. లోకేష్ సూట్ కేసులు మోయడానికి తప్ప పరిపాలనకు పనికి రారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో డబ్బుల కలెక్షన్లు ఆయనతోనే జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజా వ్యతిరేకతను పార్టీకి అనుకూలంగా మలచుకోవడానికి శ్రేణులు కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన సాగుతోందన్నారు. గతంలో కూడా రైతులందరికీ రుణమాఫీ చేస్తామని మోసం చేశారన్నారు. కరణం ధర్మశ్రీ రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ప్రజలకు మంచి సేవలందించారని, అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడిగా నియమించిన ఆయనను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

వైఎస్సార్‌కు బొత్స నివాళి



అమీన్‌సాహెబ్‌పేటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తు బొత్స సత్యనారాయణ

కశింకోట: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహా నేత అని శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ అన్నారు. మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో వైఎస్సార్ తీర్థ మహోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహానేత వైఎస్సార్ పేరిట మారుమూల గ్రామంలో అభిమానంతో ఏటా తీర్థ మహోత్సవం నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ ప్రయోగ పరీక్షలు

ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్

తుమ్మపాల: ఇంటర్ ప్రయోగ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో జిల్లా పరీక్షల కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు జిల్లాలో 88 పరీక్ష కేంద్రాలలో జరగనున్న ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పరీక్ష కేంద్రాలలో లైట్లు, టాయిలెట్స్, ఫర్నిచర్ ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద అత్యవసర మందులతో పాటు వైద్య సిబ్బంది విధులు నిర్వర్తించాలని, అక్కడ ప్రథమ చికిత్స శిబిరం ఏర్పాటు చేయాలని, మెడికల్ కిట్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచాలన్నారు. విద్యార్థులు ప్రయోగ పరీక్షలు చేసే సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా జరగాలన్నారు. మున్సిపల్, పంచాయతీ పరిధిలో ఉన్న పరీక్ష కేంద్రాల వద్ద ఆయా శాఖల అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, ఏపీఎస్‌ఆర్టీసీ పరీక్ష కేంద్రానికి హాజరయ్యే విద్యార్థులు సమయానికి చేరుకునేలా ప్రణాళిక బద్ధంగా ఆయా రూట్లలో బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటర్మీడియట్ జిల్లా అధికారి బి. సుజాత మాట్లాడుతూ ఫిబ్రవరి 1న జరిగే నైతిక విలువలు పరీక్షకు 12,936 మంది మొదటి ఏడాది విద్యార్థులు 133 పరీక్ష కేంద్రాల్లో హాజరవుతున్నట్లు తెలిపారు. 3న పర్యావరణ విద్యా పరీక్ష జరుగుతుందన్నారు. 5 నుంచి 20వ తేదీ వరకు 39 పరీక్ష కేంద్రాలలో మొదటి, రెండవ సంవత్సరం పరీక్షలకు 4,695 మంది వొకేషనల్ విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో మొబైల్, వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి.రవికుమార్, ఆర్టీసీ అధికారి వై.రవిచంద్ర, జీవీఎంసీ ఈఈ ఎస్.శేఖర్, డీఈసీ సభ్యులు శిరీషరాణి, ఎంవీఎస్ నాయుడు, విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ప్రసాద్, పాల్గొన్నారు.

అటవీ అధికారుల అదుపులో టీడీపీ నేత?

గొలుగొండ: కరక రంగురాళ్ల క్వారీ ప్రాంతంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న సాలికమల్లవరానికి చెందిన కీలక టీడీపీ నేతను అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కరక, సాలికమల్లవరం, పప్పుశెట్టిపాలెం ప్రాంతాల్లో రంగురాళ్లు తవ్వేందుకు అనుమతుల కోసం కొంతమంది దరఖాస్తులు చేసుకున్న విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత క్వారీ అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించడం కోసం కొంతమంది స్థానిక టీడీపీ నాయకులను ఇతర ప్రాంతాలకు చెందిన వారు సహాయం కోరటం జరిగింది. అలా క్వారీ ప్రాంతంలో సంచరించిన వ్యక్తులను 144 సెక్షన్ అమల్లో ఉన్న కారణంగా అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డీఎఫ్‌వో ఎం.శామ్యూల్‌ను సంప్రదించగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'చలి' ఫన్‌డుగ

- గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా అరకు చలి ఉత్సవ్
- సందడిగా 5కే మారథాన్
- పద్మాపురం గార్డెన్‌లో ఫ్లవర్ షో
- ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్ రైడింగ్
- గిరిజన నృత్యాలకు జనం ఫిదా
- నోరూరించిన చిరు ధాన్యాలతో వంటకాలు
- తొలి రోజు 5 వేల మంది హాజరు

8లో



పర్యాటకుల సెల్ఫీ టైం

పద్మాపురంలో హాట్ ఎయిర్ బెలూన్



కొమ్ము డాన్స్‌తో అలరిస్తున్న కళాకారులు



సాంస్కృతిక కార్యక్రమాలు



కూరగాయలతో తయారు చేసిన నమూనాలు

వాల్తేరు డివిజన్‌లో ఏటా బడ్జెట్ బండి కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. గంపెడు నిధులతో పరుగులు పెడుతూ వస్తున్నట్లు కనిపించినా..విత్త మంత్రి ప్రసంగం ముగిసిన తర్వాత చూస్తే.. రైలు వచ్చినట్లే వచ్చి బైపాస్‌లో మాయమైపోతోంది. దశాబ్దకాలంగా అరకొర నిధుల విదిలింపులతో వాల్తేరు పరిధిలో ప్రాజెక్టులు సా...గుతూనే ఉన్నాయి. ఉత్తరాంధ్ర వాసుల చిరకాల స్వప్నం దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన జరిగినా ఎలాంటి కదలిక లేకపోవడంతో మళ్లీ కథ మొదటికొచ్చింది. ఈసారైనా బడ్జెట్‌లో సంపూర్ణంగా నిధులు కేటాయింపులు చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

- సాక్షి, విశాఖపట్నం

బడ్జెట్ రైలు బండి.. వాల్తేరులో ఆగేనా?



ప్రతిపాదనలు ఇచ్చారా ఎంపీ సారూ.?

ప్రతి బడ్జెట్‌కు ముందు.. ఆయా ఎంపీలు తమ పరిధిలో చేపట్టాల్సిన ప్రాజెక్టులు, కొత్త రైళ్ల మంజూరు మొదలైన ప్రతిపాదనలను రైల్వే మంత్రిత్వ శాఖకు అందిస్తారు. వాటిని సాధించేందుకు నిరంతరం రైల్వే బోర్డు అధికారులతో సంప్రదింపులు చేస్తారు. గత బడ్జెట్‌తో పాటు.. ఈసారి కూడా కూటమి ఎంపీలు ఒక్క ప్రతిపాదన కూడా రైల్వే మంత్రికి అందించలేదని తెలుస్తోంది. బడ్జెట్ సమయంలో మంజూరు కాకపోతే కొత్త ప్రాజెక్టులు పట్టాలెక్కడం అసాధ్యమని తెలిసినా.. కూటమి ఎంపీల్లో ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం. ప్రతిపాదనలు లేకుంటే పనులు ఎలా అవుతాయి?

'జోన్' కథ కొనసాగుతోందంతే.!

డీపీఆర్ అందించిన నాలుగేళ్ల తర్వాత జోన్ నిర్మాణానికి రూ.9 కోట్లు కేటాయించారంటే.. ఉత్తరాంధ్ర ప్రజల సెంటిమెంట్‌పై కేంద్రానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో స్పష్టమవుతోంది. ఓవైపు ప్రధాని మోదీ వచ్చి.. ఆట్టహాసంగా విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన కూడా చేసేశారు. మరోవైపు జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రూ.149.16 కోట్లతో గతేడాది నవంబర్ 23న టెండర్లు కూడా పిలిచారు. అయితే ఈ టెండర్లు ప్రక్రియ గడువు ముగిసి నెల రోజులు గడుస్తున్నా దానిపై ఏ మాత్రం సమాచారం లేదు. ఈ బడ్జెట్‌లోనైనా పూర్తిస్థాయి నిధులు విడుదల చేస్తే తప్ప.. జోన్ కార్యాలయ నిర్మాణానికి అడుగులు పడే సూచనలు కనిపించడం లేదు.

వాల్తేరు బంధంపై సందిగ్ధత వీడేనా.?

తూర్పు కోస్తా రైల్వే జోన్‌కు వాల్తేరు డివిజన్ బంగారు బాతుగుడ్డు లాంటి ఆదాయాన్ని తెచ్చిపెట్టే అతిపెద్ద డివిజన్ వాల్తేరు. జోన్‌కు ఏటా దాదాపు రూ. 15 వేల కోట్లు ఆదాయం కాగా, ఇందులో రూ.8 వేల కోట్లు వరకూ వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. ఇప్పుడు ఇదంతా దాదాపు రాయగడ డివిజన్‌కు సొంతమవుతుంది. ఈ నేపథ్యంలో వాల్తేరు కొనసాగించాలంటూ రైల్వే ఉద్యోగులే ఉద్యమ బాట పట్టారు. డివిజన్ విడిపోతే 80 శాతం మంది ఉద్యోగులు ఇతర రాష్ట్రం పరిధిలోకి వెళ్లిపోతారు. వాల్తేరు బంధంపై సందిగ్ధత వీడేనా అని అందరూ ఎదురు చూస్తున్నారు.

ప్రజలు కోరుకుంటున్నవేంటంటే...

- **విశాఖపట్నం** రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల **విస్తరణ ఎం**తో అవసరం. అదనపు ప్లాట్‌ఫా**రాలు లేకపో**వడంతో ఔటర్‌లో గంటల తర**బడి రైళ్లు నిలి**చిపోతున్నాయి.
- **రూ.76 కోట్ల**తో మర్రిపాలెం స్టేషన్‌ను అభి**వృద్ధి పనులు** ఐదేళ్ల క్రితం నుంచి కొనసాగు**తూనే ఉన్నా**యి. గోపాలపట్నం- మర్రి**పాలెం మధ్య** రెండు ప్రధాన లైన్లతో పాటు **లూప్‌లైన్లు** ఏర్పాటు కానున్నాయి. ఇవి **ఏర్పాటైతే** వైజాగ్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయం**గా మర్రిపాలెం** అభివృద్ధి చెందుతుంది. **కానీ నిధుల** మంజూరు విషయంలో **జాప్యం జరు**గుతుండటంతో ఈ పనులు **నత్తనడకన** సాగుతున్నాయి. ఇవి పూర్తయితే **వైజాగ్‌కు** రాకుండా దువ్వాడ నుంచి బైపాస్ **మీదుగా వెళ్లి**పోతున్న 15 వరకూ రైళ్లు.. **ఇక్కడికి వచ్చే** అవకాశాలున్నాయి.
- **రూ.159.47** కోట్లతో విశాఖ-గోపాలపట్నం **మధ్య 15.31** కిమీ మేర 3వ, 4వ లైన్లు **నిర్మాణ పను**లు పూర్తి కావాలి. ఈ ప్రాజెక్టు **డీపీఆర్ ఇచ్చి** ఐదేళ్లు గడిచినా గతేడాది అక్టో**బర్‌లో పను**లు కాంట్రాక్టు సంస్థకు అప్పగించే **పనిలోనే** కాలం గడిచిపోతోంది.
- **అదేవిధంగా** గోపాలపట్నం- సింహాచలం మధ్య 3, 4 లైన్లు నిర్మించాలని దశాబ్ద కాలం నాటి ప్రతిపాదన.

వీరవల్లి అగ్రహారానికి అరుదైన గౌరవం

జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీగా పురస్కారం



ఢిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ నుంచి అవార్డు అందుకుంటున్న వీరవల్లి అగ్రహారం సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి

మాడుగుల రూరల్: వీరవల్లి అగ్రహారం జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎంపికయింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ నెల 26వ తేదీన ఢిల్లీలో కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్ చేతుల మీదుగా గ్రామ సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి అవార్డును అందుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పథకాలను 90 శాతం అమలు చేసినందుకు గాను ఈ గ్రామాన్ని ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసి, జిల్లా పంచాయతీరాజ్ శాఖ కేంద్రానికి ప్రతిపాదించింది. అవార్డు అందుకున్న అనంతరం గ్రామానికి చేరుకున్న సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి శుక్రవారం మాట్లాడుతూ హర్ ఘర్ జల్ యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ప్రధానమంత్రి పోషణ యోజన, ప్రధానమంత్రి ఉజ్వలయోజన, రైతులు పశుసంవర్ధక, కిసాన్ క్రెడిట్ తదితర పథకాలు అమలు చేసినందుకు గాను ఉత్తమ పంచాయతీగా ఎంపికయినట్టు చెప్పారు.

శాంతించిన బ్రాండిక్స్ కార్మికులు



కార్మికులతో మాట్లాడుతున్న వివిధ శాఖల అధికారులు

అచ్యుతాపురం: అధీస్థాన్ (బ్రాండిక్స్) కార్మికుల మెరుపు నిరసన శుక్రవారం ఉదయం నాటికి ముగిసింది. గురువారం మధ్యాహ్నం నుంచి మొదలైన ఈ సమ్మె అర్ధరాత్రి వరకూ కొనసాగడంతో వివిధ శాఖల అధికారులు రంగంలోకి దిగారు. పని వేళల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు యాజమాన్యం తరఫున అధికారులు వెల్లడించి కార్మికుల్ని శాంతింపజేశారు. అయితే కార్మికుల జీతాల పెంపుదలతో పాటు, కొన్ని వేధింపులపై తక్షణ పరిష్కారం చూపాలని మహిళా కార్మికులు నినదించారు. పది రోజుల్లోగా డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన మేరకు మహిళా కార్మికులు విధులకు హాజరయ్యేందుకు అంగీకరించారు. సెజ్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ రమ్య, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నర్సింగరావు, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరావు, ఆర్డీవో ఆయిషా, పరవాడ డీఎస్పీ, స్థానిక తహసీల్దార్ యాజమాన్య ప్రతినిధులతో, సీఐటీయూ నేతలతో చర్చలు జరిపి సఫలం చేశారు.

డీఈవో తోటాడ హైస్కూల్ సందర్శన

- పదో తరగతి విద్యార్థులకు సలహాలు, సూచనలు
- పదిలో శతశాతం సాధించాలని పిలుపు



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు

మునగపాక: తోటాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు సందర్శించారు. హైస్కూల్లోని గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోనే తోటాడ హైస్కూల్‌కు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రణాళికాపరంగా ఏకాగ్రతతో చదువుకుంటే లక్ష్యాలను చేరుకోగలమన్నారు. ఉపాధ్యాయులు చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి శతశాతం ఫలితాలు వచ్చేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు, హెచ్ఎం ఎస్‌వీఎస్ సోమయాజులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

చలి ఫన్‌డుగ

- గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా అరకు చలి ఉత్సవ్
- 5కె రన్ మారథాన్ పోటీలతో ప్రారంభం
- రేపటి వరకు కొనసాగనున్న కార్యక్రమాలు

ఆరంభం అదిరింది.. మూడు రోజుల పాటు జరిగే అరకు చలి ఉత్సవ్ 2025 శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవ్‌ను కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలతో అరకు హోరెత్తింది. పారా గ్లైడింగ్, ఎయిర్ బెలూన్, హెలికాప్టర్ రైడింగ్, పద్మాపురం గార్డెన్‌లో ఫ్లవర్ షో, డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఆదివాసీల వంటకాల ఫుడ్ ఫెస్ట్, వివిధ రాష్ట్రాల గిరిజన కళాకారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



ఉత్సవాలు ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్ట్‌లో గిరిజన వంటకాలతో మహిళలు

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రా ఊటీ అరకులోయలో చలి ఉత్సవ్ ఆరంభం అదిరింది. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా 'అరకు చలి ఉత్సవ్' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం 7.30 గంటలకు 5కె రన్ మారథాన్ పోటీలతో కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఉత్సవ్‌ను ప్రారంభించారు. అరకులోయ రవ్వలగూడ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన 5కె రన్ మారథాన్‌లో పర్యాటకులు, స్థానిక గిరిజన యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ప్రదర్శించిన సంప్రదాయ గిరిజన నృత్యాలైన థింసా, నగరభేరి, కూచిపూడి, జముకు పాట, బస్తర్ బ్యాండ్, తోడా డ్యాన్స్, గోండ్ ట్రైబల్ డ్యాన్స్, డప్పు వాయిద్యాల డ్యాన్స్, ఆదివాసీ యువత చేసిన తీన్‌మార్, కొమ్ముకాయి, సవర, జాతపు, మణిపూర్ డ్యాన్స్, తప్పెటగుళ్ల నృత్యాలు అలరించాయి. తొలి రోజు 5 వేల మంది వరకు ఇతర ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ ఉత్సవ్ ఈ నెల 2వ తేదీ వరకు కొనసాగుతుంది.

హాట్ ఎయిర్ బెలూన్.. పారా గ్లైడింగ్

ఉత్సవ్‌లో భాగంగా పద్మాపురం గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన హాట్ ఎయిర్ బెలూన్, మాడగడ వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన పారా గ్లైడింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హాట్ ఎయిర్ బెలూన్‌కు ఒకరికి రూ.1,800 చొప్పున టికెట్ ధర నిర్ణయించారు. హెలికాప్టర్‌లో గగనతలం నుంచి మన్యం అందాలను వీక్షించారు. పర్యాటకులెవరికీ పారా గ్లైడింగ్ చేసేందుకు అవకాశం ఇవ్వలేదు.

ఐఏఎస్, ఐపీఎస్‌లు స్టెప్‌లు..

సాయంత్రం ట్రైబల్ మ్యూజియంలో ఐఏఎస్, ఐపీఎస్‌లు డ్యాన్స్‌లు వేశారు. కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీవో అభిషేక్, అడిషనల్ ఎస్పీ ధీరజ్, మహిళా అధికారులు వస్త్రాలను తలపాగాలు కట్టుకుని వివిధ సినీ గీతాలకు డ్యాన్స్‌లు వేశారు.

తొలిసారిగా హెలికాప్టర్ రైడ్

తొలిసారిగా ప్రైవేటు భాగస్వామ్యంతో అందుబాటులోకి తెచ్చిన హెలికాప్టర్ రైడ్ పర్యాటకులకు తెగ నచ్చేసింది. 150 మంది వరకు సందర్శకులు తొలిరోజు హెలికాప్టర్ ఎక్కారు. ధర ఎక్కువైనా పర్యాటకులు తగ్గేదే లేదంటూ రైడింగ్‌కు ఆసక్తి చూపారు.

అలరించిన ఫ్లవర్ షో

పద్మాపురం గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఫ్లవర్ షో ఆకర్షించింది. ఐటీడీఏ, హార్టికల్చర్ సంయుక్తంగా ఈ షోను ఏర్పాటు చేశాయి. కడియం, విశాఖపట్నం నుంచి 10 వేలకు పైగా పెద్ద చామంతులు, 5 వేలకు పైగా గులాబీలు, ఏజెన్సీ వాతావరణానికి అనుకూలంగా ఉన్న ఆర్కిడ్స్, బంతి, జరబరాలు పువ్వులు ప్రత్యేకంగా తీసుకువచ్చారు.

ఆకట్టుకున్న 25 రకాల స్టాళ్లు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 25 రకాల స్టాళ్లు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. ఆదివాసీలు పండించే వివిధ రకాల ఉత్పత్తులు, గిరిజన సంప్రదాయ వస్తువులు, జీసీసీ ఉత్పత్తులు, చిరు ధాన్యాలను ప్రదర్శించారు. గిరిజనుల సంస్కృతిని తెలియజేసేలా పూరిగుడిసె సెట్ విశేషంగా ఆకట్టుకుంది.

ఆహా.. ఏమి రుచి : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరు ధాన్యాలతో తయారు చేసిన వంటకాలు సందర్శకులకు తెగ నచ్చేశాయి. రాగి బెల్లం పిట్టు, కందుల పిట్టు, అలసందల కిచిడీ, రాగి తోప, రాగి అంబలి, రాగి బెల్లం ఉండలు, సామ బియ్యం అన్నం, రాజ్‌మా కూర, వెదుర కొమ్ముల కూర, శంకర లడ్డూ, రాగి కుడుము, రాగి సక్కు, కర్ర పెండలం దుంపలు, రాజ్‌మా పిక్కలతో చేసిన రాబా, సారాకుల కూరతో రాబా, నాగలి దుంప, మరుగు చారు, కొర్రల బియ్యం పాయసం, చిలగడ దుంపలు, గుమ్మడి ఆకుల కూర, పిండి దుంపల కూర, అడ్డ పిక్కలు, హల్వా ఆహా అనిపించాయి.



అలరించిన ఫ్లవర్ షో



గిరిజన సంప్రదాయ ఇంటి సెట్



వెజ్ డాగ్



అలరిస్తున్న హాస్యనటులు నవీన్, తాగుబోతు రాజమౌళి



నీలినీలి ఆకాశం పాట పాడుతున్న పీవో అభిషేక్, ఎంఎం శ్రీలేఖ



పూసలు కొనుగోలు చేస్తున్న గిరిజన విద్యార్థులు

మళ్లీ నిలిచిన గానుగాట..

- గోవాడ సుగర్స్‌లో కేన్ క్యారియర్‌కు మరమ్మతులు
- ఎండుతున్న చెరకు..రైతులకు అవస్థలు



ఫ్యాక్టరీ ఆవరణంలో పెద్ద సంఖ్యలో నిలిచిపోయిన చెరకు బళ్లు



వడ్డాది చెరకు కాటా వద్ద చెరకు బళ్లు

చోడవరం : గోవాడ సుగర్స్ క్రషింగ్‌కు మరోసారి అంతరాయం కలిగింది. బాయిలర్‌కు బెగాస్ అందించే క్యారేజ్ మరమ్మతులకు గురికావడంతో క్రషింగ్ నిలిచిపోయింది. శుక్రవారం ఉదయం నిలిచిపోయిన క్రషింగ్ రాత్రికి ప్రారంభమైంది. దీంతో రైతులు చాలా ఇబ్బంది పడ్డారు. ఆర్థిక ఇబ్బందులు, కార్మికుల సమ్మెలతో ఈ ఏడాది క్రషింగ్ ప్రారంభించడమే ఆలస్యంగా జరిగింది. రోజువారీ క్రషింగ్ 2500 టన్నులకు జరుగుతుందని అంతా బాగుందనే సమయంలో ఈనెల 27న బెగాస్ కొరత ఏర్పడి ఒక రోజు పూర్తిగా క్రషింగ్ నిలిచిపోయిన సంగతి తెలిసిందే. క్రషింగ్ గాడిలో పడుతుందన్న సమయంలో మరలా శుక్రవారం ఉదయం బెగాస్ కేన్ క్యారియర్ మరమ్మతులకు గురికావడం మరింత ఇబ్బందులకు గురిచేసింది. ఫ్యాక్టరీకి గేటు, కాటాల నుంచి పెద్ద సంఖ్యలో చెరకు సరఫరా కావడంతో ఫ్యాక్టరీ వద్ద రెండు యార్డులు చెరకు బళ్లతో నిండిపోయాయి.

యార్డుల వద్ద నిలిచిపోయిన చెరకు బళ్లు

బుచ్చెయ్యపేట/మాడుగుల రూరల్ : ఫ్యాక్టరీలో క్రషింగ్ నిలిచిపోవడంతో బుచ్చెయ్యపేట, వడ్డాది చెరకు కాటాల వద్ద చెరకు సరఫరా జరగడం లేదు. వీరవల్లి, కొత్తూరు, లక్ష్మీపురం, దిబ్బిడి, ఐయితంపూడి, కందిపూడి, బుచ్చెయ్యపేట, వడ్డాది తదితర గ్రామాలకు చెందిన రైతులు తీసుకొచ్చిన చెరకు బళ్లు యార్డుల్లో నిలిచిపోయాయి. ఎండకు చెరకు ఎండిపోయి దిగుబడి తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు. ఎడ్లు పశుగ్రాసం లేక ఆర్థాకలితో అలమటిస్తున్నాయి. వడ్డాది, బుచ్చెయ్యపేట కాటాల వద్ద 400 టన్నులకు పైగా చెరకు ఉండిపోయింది. మాడుగుల మండలం కె.జె.పురం, ఘాట్‌రోడ్డు, చెరకు కాటాల వద్ద కూడా ఇదే పరిస్థితి.

పబ్లిగ్గానే బొక్కేస్తున్నారు..!

- గొటివాడ రీచ్‌లో అనధికారికంగా ఇసుక వేలం
- రూ.15.50 లక్షలకు ఖరారు
- హోంమంత్రి ఇలాకాలో దర్జాగా దందా
- బరి తెగించిన టీడీపీ నేతలు

కోటవురట్ల : హోంమంత్రి వంగలపూడి అనిత సొంత నియోజకవర్గంలో టీడీపీ నాయకులు బరితెగించారు. అధికారం అండతో జంకూబొంకూ లేకుండా ఇసుకను అక్రమంగా తరలించుకుపోయేందుకు రంగం సిద్ధం చేశారు. గొట్టివాడ ఇసుక రీచ్‌లో ఇసుక తరలింపు కోసం గురువారం రాత్రి గొట్టివాడ గ్రామంలో అనధికారికంగా వేలం నిర్వహించారు. 60 రోజుల పాటు ఇసుకను తరలించుకుపోయేందుకు ఏకంగా రూ.15.50 లక్షలకు టీడీపీ నాయకులు వేలం పాడుకున్నారు. గతంలో కూడా ఇక్కడ ఇసుక తవ్వకాల కోసం రూ.5 లక్షలకు వేలం నిర్వహించి అధికారం అండతో సుమారు రూ.కోటి విలువ చేసే ఇసుకను తరలించుకుపోయారు. అక్రమ ధనార్జన రుచి మరిగిన టీడీపీ నాయకులు ఈసారి ఏకంగా మూడురెట్లు అధికంగా వేలం దక్కించుకోవడం గమనార్హం. గతంలో ఇసుక అక్రమ తరలింపుపై సాక్షిలో 'వరాహనదిలో ఇసుక తోడేళ్లు' పేరిట కథనం వెలువడగా అధికారులు తూతూ మంత్రంగా దాడులు చేసి ఇసుక రీచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. తహసీల్దారు తిరుమలబాబు, అధికారుల బృందం రీచ్‌ను పరిశీలించి ఇసుక నిల్వలు లేవని, కేవలం ప్రభుత్వ పనులకు మాత్రమే అనుమతి ఇస్తామని ప్రకటించారు. అధికారుల ప్రకటనను లెక్కచేయకుండా టీడీపీ నాయకులు 60 రోజుల పాటు అక్రమ దందా చేసేందుకు తెరదీశారు. ఇక రాత్రీ పగలూ తేడా లేకుండా ఇసుక తరలింపు సాగనుంది. ఇందుకు పార్టీ పెద్దల అండదండలు ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ఇందులో అందరికీ వాటాలు వెళతాయని, ఆ రెండు నెలల కాలంలో రూ.2 కోట్లు వెనకేసుకునేలా టీడీపీ నాయకులు స్కెచ్ వేసినట్టు స్పష్టమవుతోంది. పబ్లిగ్గా ఇసుక వేలం నిర్వహించి సవాల్ విసురుతున్నారు.

బైక్ ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన సతీష్

మాకవరపాలెం : బైక్ ప్రమాదంలో ప్రైవేటు బస్సు డ్రైవర్ మృతి చెందాడు. దీంతో పండగ రోజున గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. మండలంలోని లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన రొంగల సతీష్(25) నర్సీపట్నం ఆర్టీసీ డిపోలో హైయర్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఈ గ్రామంలో గౌరీ పరమేశ్వరుల తీర్థమహోత్సవం కావడంతో ఇంటి వద్దే ఉన్నాడు. ఇంటి నుంచి బైక్‌పై వేరే వీధిలోకి వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను తప్పించే క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో సతీష్ తలకు తీవ్రగాయాలుకాగా వెనుక కూర్చున్న అనంత్‌కు కాలికి గాయాలయ్యాయి. సతీష్‌ను ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. సతీష్ మృతితో గ్రామంలో విషాదం అలముకోగా, చేతికి అందివచ్చిన కొడుకు మరణం తల్లిదండ్రులకు తీరని వేదన మిగిల్చింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్ఐ దామోదర్‌నాయుడు తెలిపారు.

బైక్‌ను తగులబెట్టిన దుండగులు



ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో దగ్ధమవుతున్న బైక్

నర్సీపట్నం : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని సెలూన్‌షాప్ పక్కన పార్కు చేసిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి తగలబెట్టారు. ఇటీవల నర్సీపట్నంలో వరుస సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఎస్సీ, బీసీ కాలనీల్లో మూడు బైక్‌లతో పాటు ఏరియా ఆస్పత్రి సమీపంలో పార్కు చేసి ఉన్న రెండు అంబులెన్స్‌లను దుండగులు తగులబెట్టిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని బైక్‌ను తగలబెట్టారు. బైక్ నుండి మంటలు ఎగిసి పడడంతో సమీపంలో ఉన్న దుకాణదారులు పరుగులు తీశారు. వరుస సంఘటనలో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రిమాండ్ ఖైదీలు నిందితులే.. దోషులు కారు



సబ్‌జైలు సందర్శించిన న్యాయమూర్తి

చోడవరం రూరల్ : రిమాండ్ ఖైదీలు నిందితులేగానీ దోషులుగా నిర్ధారణ జరగనందున, వారి పట్ల కాఠిన్యం వహించరాదని, వారికున్న ప్రాథమి క హక్కులకు భంగం వాటిల్లేలా చర్యలు తీసుకోరాదని చోడవరం సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ కమిటీ చైర్మన్ వి.గౌరీశంకరరావు అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక సబ్ జైలును సందర్శించి, రిమాండ్ ఖైదీల స్థితిగతులను తెలుసుకున్నారు. వారికి రోజువారీ అందిస్తున్న ఆహార, పానీయాల గురించి సబ్ జైలు వార్డర్ వి.వీర్రాజును అడిగి తెలుసుకున్నారు. వంటగది, జైలు గదులు, పరిసరాలను పరిశీలించారు. ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతూ సబ్‌జైలులో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు.

నూకాంబికను దర్శించుకున్న ధర్మశ్రీ



నూకాంబిక అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు ధర్మశ్రీ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారిని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూకాంబిక అమ్మవారి దర్శనం సర్వాభీష్ట ప్రదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో 80వ వార్డు ఇన్‌ఛార్జి కె.ఎం.నాయుడు, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ సీనియర్ నాయకులు బొడ్డేడ లక్ష్మీనరసింహారావు, వేగి త్రినాథ్, దాడి నారాయణరావు, నడిశెట్టి మధు, పిల్లా రాజు, రాయవరపు జోగిరాజు పాల్గొన్నారు.

సోమనాథ వజ్రలింగ దర్శన వాహనానికి స్వాగతం



వాహనానికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

అచ్యుతాపురం: సోమనాథ వజ్రలింగ దర్శన వాహనం శుక్రవారం అచ్యుతాపురం మండలంలోకి ప్రవేశించింది. ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో 65 వేలకు పైగా గ్రామాల్లో పర్యటించిన ఈ వాహనం అచ్యుతాపురం మండలంలోకి రాగా సీనియర్ నాయకులు ద్వారాపురెడ్డి బాబ్జి,ప్రజాహిత బ్రహ్మ కుమారీస్‌లు స్వాగతం పలికారు. సోమనాథ్ ఆలయ నమూనాతో రూపొందించిన ఈ వాహనాన్ని దేశమంతటా తిప్పనున్నారు. రెండు రోజుల పాటు అచ్యుతాపురం మండలంలో పర్యటించనున్న వాహనం ద్వారా స్వామి దర్శనం, ఆధ్యాత్మిక విలువలతో కూడిన ప్రవచనాలను ప్రజలకు వివరిస్తారని నిర్వాహకులు తెలిపారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం అవసరం

విశాఖ–లీగల్: వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో ఉపకరిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని శిక్షణ కేంద్రంలో న్యాయమూర్తులు, న్యాయవాదులకు జరుగుతున్న మధ్యవర్తిత్వ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ న్యాయస్థానాల్లో లెక్కకు మించి పేరుకుపోతున్న కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో మేలు చేస్తుందన్నారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న న్యాయమూర్తులకు, న్యాయవాదులకు ప్రత్యేక ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం శిక్షకులు సత్యారావు, రత్నతార, విశ్రాంతి న్యాయమూర్తులు, న్యాయవాదులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ పాల్గొన్నారు.

పెద్దపేట గ్రామాన్ని సందర్శించిన డ్వామా పీడీ

సాక్షి ఎఫెక్ట్..



గ్రామంలో విచారణ చేస్తున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

రోలుగుంట : మండలంలో ఎం.కె.పట్నం పంచాయతీ శివారు పెద్దపేట రెవెన్యూ పరిధిలో గిరిజనులకు ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ గురువారం వినూత్నంగా ధర్నా చేపట్టారు. 'ఆదివాసీ కూలీల వినూత్న నిరసన' శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు జిల్లా అధికారులు స్పందించారు. జిల్లా డ్వామా ప్రాజెక్టు అధికారి పి.పూర్ణిమాదేవి, సహాయ ప్రాజెక్టు అధికారి పి. చిన్నారావు, ఎంపీడీవో ఈ గ్రామాన్ని సందర్శించారు. జాబ్‌కార్డులు వుండి, ఉపాధి పనులు ఎందుకు కల్పించలేదని అధికారులను ప్రశ్నించారు. పాంగి రాజులమ్మ మాట్లాడుతూ తనకు జాబ్ కార్డు ఉండి కూడా గత రెండు సంవత్సరాల నుంచి పని కల్పించలేదని పీడీకి తెలిపారు. ఉపాధి చట్టం వచ్చి నేటికి 18 సంవత్సరాలు అవుతున్నా వంద కుటుంబాలకు 60 కుటుంబాలు ఉన్నాయని, ఈ గ్రామంలో అందరికీ ఉపాధి పని కల్పించకపోవడంతో 30 జాబ్‌కార్డులు రద్దు అయ్యాయని, ప్రస్తుతం ఉపాధి పనులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె. గోవిందరావు మాట్లాడుతూ నాన్ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసులకు కనీసం పని కల్పించలేదన్నారు. పీడీ స్పందిస్తూ రద్దు చేసిన జాబ్‌కార్డులు వెంటనే పునరుద్ధరిస్తానని, జాబ్‌కార్డులు లేనివారికి జాబ్‌కార్డులు ఇస్తామని, శనివారం నుంచి ఉపాధి పనులు కల్పిస్తామని తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో నాగేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి చిరంజీవి పాల్గొన్నారు.

రేపు ఒడిశాకు అప్పన్న ప్రచార రథం

సింహాచలం: సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలో పర్యటించనుందని ఈవో వి.త్రినాథరావు శుక్రవారం తెలిపారు. ఏటా సింహగిరిపై మూడు నెలల పాటు ఉండి స్వామికి సేవలందిస్తున్న ఒడిశాలోని పట్టుపురానికి చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ఆధ్వర్యంలో పలు చోట్ల స్వామి కల్యాణోత్సవాలు జరగనున్నాయని వివరించారు. ఈ నెల 2న మధ్యాహ్నం సింహాచలం నుంచి ప్రచార రథం ఒడిశా బయలు దేరుతుందన్నారు. బరంపురం సమీపంలోని పట్టుపురంలో 3న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీ నృసింహహోమం, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు స్వామి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. పద్మనాభపురంలో 4న ఉదయం 9 గంటల నుంచి శ్రీనృసింహ హోమం, సాయంత్రం 5 గంటల నుంచి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. విష్ణుచక్రపురంలో 5న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు, అదే రోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హుండీఘర్‌లో కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు. 6న ఉదయం 10 గంటల నుంచి చికిడీలో కల్యాణోత్సవం నిర్వహించిన అనంతరం, మధ్యాహ్నం 2 గంటలకు ప్రచార రథం సింహాచలం బయలుదేరుతుందని వివరించారు. రథంతో పాటు దేవస్థానం ఉద్యోగులు, వైదికులు తరలివెళ్లనున్నారు.

అదుపు తప్పితే కాలువలోకే..



రోడ్డుకు సమాంతరంగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువ నీరు

- ప్రమాదకరంగా బొజ్జన్నకొండ రోడ్డు
- దీనికి సమాంతరంగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువ
- రక్షణ గోడ లేక వాహనదారుల భయాందోళన



ఇటీవల ఏలేరు కాలువలోకి దూసుకుపోయిన బొలేరో వాహనం

తుమ్మపాల: పురాతన చరిత్ర కలిగిన బొజ్జన్నకొండ సమీపంలో ఏలేరు కాలువ ప్రమాదాలకు నిలయంగా మారింది. తుమ్మపాల నుంచి శంకరం జాతీయ రహదారి వరకు నాలుగు కిలోమీటర్ల పొడవున విస్తరించిన రోడ్డుకు ఆనుకుని ఏలేరు కాలువ ఉంది. దీనికి ఎటువంటి రక్షణ గోడ లేకపోడంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఎదురుగా లారీలు వస్తే చాలు ఏలేరు కాలువ ఒడ్డుకు రావాల్సి ఉంది. ఆ సమయంలో అదుపు తప్పితే రెప్పపాటులో కాలువలోకి దూసుకుపోయి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల జాతీయ రహదారి నుంచి శంకరం మీదుగా బొజ్జన్నకొండ రోడ్డుకు చేరుకోగానే ఎదురుగా టిప్పర్ లారీ రావడంతో సైడ్‌కు రావాల్సిన బొలేరో అదుపుతప్పి ఏలేరు కాలువలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నీటిలోనే మృతి చెందిన ఘటన అందరిని కలచి వేసింది. ద్విచక్ర వాహనాలు కూడా అదుపు తప్పిన సందర్భాలు ఉన్నాయి.

ప్రమాదకరంగా ఏలేరు కాలువ...

ఆహ్లాదకర వాతావరణంలో ఉన్న బొజ్జన్నకొండ రోడ్డు మీదుగా పట్టణవాసులు అటు తుమ్మపాల, ఇటు శంకరం నుంచి వ్యాయామ, నడక చేస్తుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్వారీ టిప్పర్లు పరిమితికి మించి ఓవర్ లోడ్‌తో వేగంగా ప్రయణించడంతో రోజూ ఉదయం, సాయంత్రం వచ్చే వ్యాయామకారులు భయాందోళనకు గురై రావడం మానేశారు. ముందు నుయ్యి, వెనక గొయ్యి అన్న చందంగా రోడ్డుపై లారీలు, పక్కనే ఏలేరు కాలువ నిత్యం ప్రాణసంకటంగా మారింది. రోడ్డుకు ఆనుకుని భయంకరమైన ఏలేరు కాలువలోకి దూకి పలువురు మహిళలు మృతి చెందారు.

రోడ్డుపై పెరుగుతున్న ప్రయాణికులు....

జిల్లా కేంద్రంగా ఉన్న అనకాపల్లి పట్టణానికి సమీపంలో శంకరం గ్రామంలోనే కలెక్టరేట్, పోలీస్ కార్యాలయం, ఇతర జిల్లా కార్యాలయాలు ఉన్నాయి. పట్టణంతోపాటు జిల్లాలో మాడుగుల, చోడవరం, రావికమతం, బుచ్చెయ్యపేట, చీడికాడ, కోటపాడు వలు మండలాల నుంచి నిత్యం కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు, ప్రజలు అధిక సంఖ్యలో బొజ్జన్నకొండ రోడ్డు మీదుగానే రాకపోకలు చేస్తున్నారు. మండలం నుంచి రాంబిల్లి ఎన్ఏవోబీకి రాయిని తరలించే టిప్పర్లు సైతం ఈ రోడ్డు మీదుగానే జాతీయ రహదారికి చేరుకుంటున్నాయి. ఈ క్రమంలో ద్విచక్ర వాహనదారులు, చిన్న వాహనాలు అదుపు తప్పితే అంతే సంగతులు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న కాలువలోకి దూసుకెళ్లడం ఖాయంగా ఉంది.

రక్షణకు చర్యలు చేపట్టాలి....

సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ఏలేరు కాలువతో పాటు కొనసాగిన బొజ్జన్నకొండ రోడ్డు తుమ్మపాల నుంచి బొజ్జన్నకొండ వరకు ఏలేరు కాలువ కన్నా ఎత్తుగాను, బొజ్జన్న కొండ నుంచి శంకరం జాతీయ రహదారి వరకు ఉన్న రోడ్డు ఏలేరు కాలువ నీటి ప్రవాహానికి సమాంతరంగాను ఉంది. దీంతో అదుపుతప్పితే నేరుగా ఏలేరు కాలువలోకి చేరిపోవడం ఖాయంగా ఉంది. ఇటీవల ప్రమాదాలతో భయాందోళకు గురైన వాహనదారులు తక్షణమే రక్షణ గోడ నిర్మించాలని నిరసనలు చేపట్టారు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.





ప్రమాదం అంచున రాకపోకలు చేస్తున్న వాహనాలు

ప్రమాదం అంచున ప్రయాణం



ఏలేరు కాలువలో నీటి ప్రవాహం ప్రమాదస్థాయిలో ఉంది. జిల్లాలోనే బొజ్జన్నకొండ పరిసరాలు పల్లం భూములు కావడంతో ఇక్కడ ఏలేరు కాలువ నిండుగా గట్టు మునిగి ప్రవహిస్తోంది. ఈ గట్టును ఆనుకుని బొజ్జన్నకొండ రోడ్డు ఉండటంతో నిత్యం రాకపోకలు చేసే ప్రయాణికులు ప్రమాదం అంచున ప్రయాణించాల్సి వస్తోంది. ఏలేరు కాలువకు రోడ్డుకు మధ్య రక్షణ గట్టు లేకుంటే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పాలకులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

– కొణతాల హరినాథ్‌బాబు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు, అనకాపల్లి

శంకరం గ్రామం మునిగిపోయే ప్రమాదం



ఏలేరు కాలువ గట్టు ఎత్తు చేయకపోతే భారీ వర్షాలకు శంకరం గ్రామం మునిగిపోయే అవకాశముంది. గతేడాది భారీ వర్షాలకు పంటలన్నీ మునిగిపోయి నీరు నిలిచిపోయింది. ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువ గట్టుపై సిమెంట్ బస్తాలు వేసి తాత్కాలికంగా పనులు చేశారు. అలాంటప్పుడు గట్టు తెగిపోతే శంకరంతోపాటు అనకాపల్లి పట్టణం ముంపునకు గురవుతుంది. బొజ్జన్నకొండ స్వాగత తోరణం వద్దనే రోడ్డు, కాలువ కలిసిపోయాయి. అక్కడ మలుపు వద్ద అదుపు తప్పితే వాహనాలు కాలువలోకి పోవాల్సిందే.

– తోట ఉదయ్‌కుమార్, శంకరం గ్రామం

క్లుప్తంగా

ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ప్రమాదం



వెనుక భాగం దెబ్బతిన్న ఆర్టీసీ డాల్ఫిన్ బస్సు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం కూడలిలో ఆర్టీసీ డాల్ఫిన్ ఎక్స్‌ప్రెస్ బస్సుకు శుక్రవారం పెద్ద ప్రమాదం తప్పింది. జాతీయ రహదారిపై విజయవాడ నుంచి విశాఖ వెళుతున్న బస్సును వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో వెనుక భాగం, అద్దాలు దెబ్బతిన్నాయి. అయితే అదృష్టవశాత్తు ప్రయాణికులకు ఎటువంటి హాని జరగలేదు. ప్రయాణికులను వేరో బస్సులో ఎక్కించి గమ్యాలకు తరలించారు.

మద్యం విక్రేత అరెస్టు

కశింకోట: మండలంలోని జమాదులపాలెం గ్రామ శివారులో మద్యం విక్రయిస్తుండగా పోలీసులు దాడి చేశారు. ఈ మేరకు 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ కె.ఎస్. గణేష్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా నిందితుడు పడాల రామును అరెస్టు చేశామన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



కాకరాపల్లిలో ఆక్రమణలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

మునగపాక: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని కాకరాపల్లి, ఒంపోలు పేట, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఆక్రమణలను శుక్రవారం తొలగించే చర్యలను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా ఆక్రమణలు ఉన్నట్లు తమ దృష్టికి తీసుకువస్తే, వాటిని తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ పడాల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నర్సీపట్నం : బలిఘట్టం పాకలపాడు గురువుగారు ఆశ్రమంలో నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్లో 1968–69 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు శుక్రవారం సమావేశమయ్యారు. 55 ఏళ్ల క్రితం హైస్కూల్ విద్యను అభ్యసించిన విద్యార్థులంతా ఒక చోట చేరారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తాము చదువుకున్న స్కూల్‌ను సందర్శించి విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పట్లో ఇంగ్లిష్‌ను బోధించిన శాస్త్రి మాస్టార్‌ను కలిసి వారి దంపతులను సత్కరించారు. కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు సింహాచలం, జయంతి, సత్యనారాయణ, నీలం రాంబాబు సారథ్యం వహించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 7,538 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,680	4,450
మొదటి రకం	3,400	3.980
రెండో రకం	2,940	3,710
మూడో రకం	2,600	3,000

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
ప్రేమిస్తావా	: సత్యనారాయణ స్క్రీన్-2
మదగజరాజ	: పర్తిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	: షిర్డీసాయి
ఏజెంట్ గయ్ 001	: వెంకటేశ్వర
గేమ్ ఛేంజర్	: శ్రీసత్య
మహేష్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 105 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–11 యూనిట్లు , బీ పాజిటివ్–35 యూనిట్లు, ఓ పాజిటివ్–50 యూనిట్లు, ఏబీ పాజిటివ్–8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 346 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

పదవీ విరమణ పొందిన పోలీసులకు సన్మానం



పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్

అనకాపల్లి: పోలీస్ శాఖలో విధి నిర్వహణలో అంకిత భావంతో విధులు నిర్వహించిన ప్రతి వ్యక్తికి గుర్తింపు ఉంటుందని అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్. మోహనరావు తెలిపారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందికి సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించడంతో పాటు, ప్రజలకు అహర్నిశలు సేవలు అందించారని ఏఎస్పీలు ప్రశంసించారు. పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదైనా, సమాజ రక్షణ కోసం సేవ చేయడం గొప్ప గౌరవంగా ఉంటుందని తెలిపారు. పదవీ విరమణ అనంతరం శేష జీవితంలో కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలన్నారు. అవసరమైనప్పుడు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అనంతరం సీసీఎస్ అనకాపల్లి ఎస్ఐ వి.వి.ఎస్. ప్రసాద్, ఏఎస్ఐలు జె.వి.ఆర్.ఎస్. సుబ్బరాజు, ఎన్.రాజబాబు, పి.ఎస్ హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాసరావు (వలంటరీ రిటైర్మెంట్), చింతపల్లి మండలం లోతుగెడ్డ జంక్షన్ వద్ద మావోయిస్టుల మందుపాతర పేలుడు ఘటనలో వీర మరణం పొందిన ఎ.ఆర్.పి.సి కీర్తిశేషులు వై.సురేంద్ర రావు సతీమణి పద్మావతిని సత్కరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రపు పరుగు పోటీల విజేత రామన్నపాలెం



అమీన్‌సాహెబ్‌పేటలో గుర్రపు పరుగు పోటీలు



ఆసక్తిగా తిలకిస్తున్న జనం



బహుమతులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్

కశింకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేటలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి గుర్రపు పరుగు పోటీలో రామన్నపాలెంకు చెందిన గుర్రం విజేతగా నిలిచింది. ఇక్కడ వైఎస్సార్ తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన పోటీలో భోగాపురం గుర్రానికి ద్వితీయ, కోటనందురు గుర్రానికి తృతీయ, యలమంచిలి గుర్రానికి చతుర్థి, రామన్నపాలెం మరో గుర్రానికి పంచమ స్థానాలు లభించాయి. ఈ పోటీలను వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ ప్రారంభించారు. విజయం సాధించిన గుర్రాల నిర్వాహకులకు నగదు బహుమతులు అందజేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి ఉత్సాహంగా పోటీలకు ప్రజలు హాజరయ్యారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, ఉప సర్పంచ్ యర్రంశెట్టి శ్రీను తదితరులు హాజరయ్యారు. ఉదయం మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం వద్ద మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిగింది. రాత్రికి బుర్రకథ, డ్యాన్స్ షో వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. తీర్థం సందర్భంగా ఆకాశ చక్రంపై పిల్లలు ఉత్సాహంగా తిరుగాడారు. విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. బాణసంచా కాల్చారు.

'ల్యాండ్‌పూలింగ్ రైతులకు న్యాయం చేస్తాం'



రైతుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: పెదముషిడివాడలో ల్యాండ్ పూలింగ్ రైతులకు న్యాయం జరిగేలాచర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన ల్యాండ్ పూలింగ్ బాధిత రైతులను పరామర్శించారు. ల్యాండ్‌పూలింగ్‌లో సర్వే నంబర్లు 13, 63, 430 నుంచి 450లో తమకు 193 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందని చెప్పారు. సదరు భూములకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించలేదని పేర్కొన్నారు. సమస్యను అతి త్వరలో పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే భరోసానిచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పంచకర్ల ప్రసాద్, బుగిడి రామగోవిందరావు, బొద్దపు శ్రీనివాసరావు, బలిరెడ్డి అప్పారావు, ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, కరణం నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దు'



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: మాదకద్రవ్యాలు, ఇతర మత్తు పదార్థాలు వాడడం వలన జీవితాలు నాశనమవుతాయని పెందుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. యువత మత్తుకు దూరంగా ఉండాలని హితవు పలికారు. శుక్రవారం పెందుర్తిలోని మేజర్ డిఫెన్స్ అకాడమిలో 'యాంటీ డ్రగ్స్'అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యుక్త వయసులో తెలిసీ తెలియక డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు అలవాటుపడి బంగారం లాంటి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలన్న సంకల్పంతో, లక్ష్య సాధన కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అహర్నిశలు శ్రమించి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు. అకాడమీ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల



వాలీబాల్ విజేతగా నిలిచిన ఆర్యభట్ట కళాశాల విద్యార్థులు

సబ్బవరం: విశాఖలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024–25లో భాగంగా నిర్వహించిన స్టేట్ లెవల్ వాలీబాల్ పోటీల్లో స్థానిక ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచిందని కళాశాల సెక్రటరీ సీహెచ్ మహందత్త శుక్రవారం మీడియాకు తెలిపారు. ఈ నెల 28 నుంచి 30 వరకూ జరిగిన ఈ పోటీల్లో గేమ్స్ విభాగంలో చాంపియన్ షిప్ సాధించినట్లు పేర్కొన్నారు. వాలీబాల్ పోటీలో తూర్పుగోదావరి జిల్లా జట్టుతో ఫైనల్‌లో తలపడి విజయం సాధించిన కళాశాల జట్టు సభ్యులను పీడీ ప్రవీణ్‌తో పాటు కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం



కన్యకాపరమేశ్వరి ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంపై ఊరేగిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న ఆలయ అర్చకులు

అనకాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారికి ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంపై పట్టణంలో పురవీధుల్లో ఊరేగించారు. నగర సంకీర్తన, గోపూజ, అమ్మవారి ఆలయంలో విగ్రహానికి పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, నిత్యప్రార్థన, పూజలు, లలితా సహస్రనామ స్తోత్ర పారాయణ, జై వాసవాంబ జై–జై కన్యకాంబ జై అనునామ సంకీర్తన మధ్యాహ్నం అమ్మవారి ప్రసాద వితరణ, అన్నసమారాధన, సాయంత్రం వాసవీ మహిళా భక్తి సంకీర్తన కళా దర్బార్ వారిచే భక్తి పాటలు, 102 వెండి ప్రమిదలతో జ్యోతుల ఆరాధన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో ప్రతిష్ట శత జయంతి ఉత్సవ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు



రోటరీ ఫ్యామిలీ క్లబ్ సభ్యులను శాలువాలతో సత్కరించిన ఎస్ఎస్ వర్మ

అనకాపల్లి: ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు చేస్తూ జీవితాన్ని గడపాలని అనకాపల్లి ఇన్‌కమ్ ట్యాక్స్ ఆడిటర్ ఎస్.ఎస్.శర్మ తెలిపారు. శుక్రవారం స్థానిక న్యూకాలనీ పాలూరు రోటరీ కల్యాణ మండపంలో ఫ్యామిలీ ఆఫ్ రోటరీ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిపాటు రోటరీ క్లబ్ సభ్యులు బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పేదలకు ధనవంతులు తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. అనంతరం గతేడాది ఉత్తమ సేవలు చేసిన రోటరీ ఫ్యామిలీ కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఫ్యామిలీ రోటరీ చైర్మన్ చిత్తంబరం, అధ్యక్షుడు సరిపల్లి రాజేష్, కార్యదర్శి అనిల్, సభ్యులు డాక్టర్ శేషు కుమార్, రఘురాం జోహార్, కే సతీష్, సాన త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వర్లు మొరాయించడంతో ఇక్కట్లు

యలమంచిలిలో రెండ్రోజుల్లో 165 రిజిస్ట్రేషన్లు

యలమంచిలి రూరల్: ఈ నెల ఒకటో తేదీ నుంచి భూములు, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతున్నట్టు గత నెల ప్రభుత్వం ప్రకటించడంతో ముందుగా రిజిస్ట్రేషన్లు చేయించుకునేందుకు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి క్రయ, విక్రయదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రెండ్రోజులుగా స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ సర్వర్లు మొరాయించడంతో కక్షిదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. గురు, శుక్రవారాల్లో 165 వరకు రిజిస్ట్రేషన్లు జరిగినట్టు తెలుస్తోంది. సర్వర్లు మొరాయించడంతో సాయంత్రం 5 గంటల వరకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఆ తర్వాత త్వరగా ప్రక్రియ పూర్తి కావడంతో డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గత నెల 27వ తేదీన భూముల విలువలు, రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచుతున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇదే విషయాన్ని కొద్దిరోజుల ముందుగా ప్రకటిస్తే ఇంత ఇబ్బంది పడేవారం కాదని పలువురు కక్షిదారులు వాపోయారు. మరోవైపు యలమంచిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సరైన వసతులు లేక క్రయ, విక్రయదారులు ఇబ్బందులు పడ్డారు.

3 నుంచి మూడు రోజుల ఫార్మా ఎక్స్‌పో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు

పరవాడ: జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ఫార్మాసిటీ మాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4, 5 తేదీల్లో మూడు రోజుల పాటు ఫార్మా ల్యాబ్స్ కం ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు ఎంఏఎస్ఆర్ఎం కార్యదర్శి జెట్టి సుబ్బారావు తెలిపారు. ఫార్మాసిటీ ఎంఏఎస్ఆర్ఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫార్మా రంగంలో వ్యాపార సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఈ ఎగ్జిబిషన్ దోహదపడుతుందన్నారు. ఇక్కడ మూడోసారి నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లో అత్యాధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన సమాచారాన్ని అందించనున్నట్లు తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది ప్రదర్శనకారులు ఈ ఎగ్జిబిషన్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. మార్కెట్లో నూతన పోకడలను అవలంబించడం ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా అనుభవాన్ని, సాంకేతిక నైపుణ్యాలను ఎగ్జిబిషన్ హైలెట్ చేస్తుందని చెప్పారు. ఈ ఎగ్జిబిషన్‌తో పరవాడ, అచ్యుతాపురం, పైడిభీమవరం, నక్కపల్లి ప్రాంతాల్లోని ఫార్మాస్యూటికల్స్, తయారీదారులు, అనుబంధ పరిశ్రమల నిపుణులకు ఎంతగానో ప్రయోజనం కలుగుతుందన్నారు. అనిల్‌కుమార్ శుక్లా ఆర్గనైజర్‌గా వ్యవహరించనున్న ఈ ఎక్స్‌పోను పారిశ్రామిక వేత్తలతోపాటు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బ్రాండిక్స్ ఉద్యోగులపై పనిభారాన్ని తగ్గించాలి



మాట్లాడుతున రాజాన దొరబాబు

అనకాపల్లి: బ్రాండిక్స్ ఉద్యోగులకు ఈ నెల ఒకటి నుంచి అదనంగా అరగంట పనిచేయాలన్న కంపెనీ నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. స్థానిక దొడ్డి రామునాయుడు భవనంలో ఆదివారం యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రాండిక్స్ కంపెనీకి విశాఖ ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి మహిళా ఉద్యోగులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. వీరంతా అరగంట అదనంగా పనిచేయకుంటే విధులు నుంచి తొలగిస్తామని, భయాందోళన చేయడం సరైన విధానం కాదన్నారు. కంపెనీలో 8 గంటల పని విధానాన్ని మాత్రమే అమలు చేయాలని కోరారు. మహిళా కార్మికుల పట్ల బ్రాండిక్స్ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు సరైన పద్ధతికాదన్నారు. దీనిపై జిల్లా అధికార యంత్రం తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్ నాయకులు కండేపల్లి త్రినాథ్, బొంది బాబ్జి, విత్తనాల పోతురాజు, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.